క్లుప్తంగా

ఓటర్ల తొలగింపు ఉంటే బీఎల్‌ఏలకు తెలపాలి

సిద్దవటం : ఓటర్ల తొలగింపు ఉంటే బీఎల్‌ఓలు బీఎల్‌ఏలకు తెలపాలని తహసీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు. సిద్దవటంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఓటర్ల జాబితాపై బీఎల్‌ఓల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో బీఎల్‌ఓల ద్వారా పూర్తిగా పరిశీలన చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌కృష్ణ, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట



కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సర్పంచ్ దంపతులు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో వెలసిన కోదండ రామాలయంలో శనివారం నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది. కొత్తపల్లె గ్రామ సర్పంచ్ భూమసాని అంజలి దంపతులు, లక్ష్మీరెడ్డి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరెడ్డి, డాక్టర్ చిన్నరెడ్డి సతీమణి సరోజమ్మ, డి.రెడ్డయ్య సతీమణి రామకుమారి, గ్రామ పెద్దలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

చంద్రయాన్ 3 విజయోత్సవ ర్యాలీ



చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని టి.చాకిబండ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. చంద్రయాన్-3 రూపకల్పనలో పాలు పంచుకున్న యువ శాస్త్రవేత్తలందరికీ జయహో అంటూ విద్యార్థులు నినదించారు. ఇలాంటి ర్యాలీలు విద్యార్థులకు ప్రజలకు స్ఫూర్తిదాయకమని హెచ్‌ఎం సుంకర శివయ్య తెలిపారు. ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాసం రెండో శనివారం వేడుకలు

సంబేపల్లె : మండల వ్యాప్తంగా గల ఆంజనేయస్వామి ఆలయాలలో శ్రావణ మాసం రెండో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టపల్లె, మోటకట్ల, సంబేపల్లె, పాలబండ తదితర గ్రామాల్లోని ఆంజనేయ స్వామి వారి మూలవిరాట్‌మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వార్లకు అభిషేక పూజలు, ఆకు పూజలు, సింధూర పూజలు చేశారు. సమీప ప్రాంతాల భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రేషన్ ఆపరేటర్లకు జీతాలు పెంచాలి

పెనగలూరు : ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే రేషన్ ఆపరేటర్లకు జీతాలు పెంచాలని పెనగలూరు మండల ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దవరం సుబ్బరాయుడు కోరారు. శనివారం ఆపరేటర్లు ఆర్‌ఐ చంద్రమోహన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా తమకు జీతాలు పెంచాలన్నారు. వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు అదనంగా చార్జీలు వసూలు చేయకుండా చూడాలని, కాటాల లైసెన్సును రెన్యువల్ చేయాలని కోరారు.

అభయ హస్త ఆంజనేయస్వామికి పూజలు

వీరబల్లె (రాయచోటిటౌన్) : మట్లి గ్రామం యల్లంపల్లెలో శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ సోమారపు నాగార్జు నాచారి, మాజీ సర్పంచ్ వెంకటరమణ నాయుడు, రవి నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించిన ఉన్నతాధికారులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని చింతలకుంట వాండ్లపల్లె వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను శనివారం ఎస్‌ఈ రమణ, ఈఈ చంద్రశేఖర్ రెడ్డిలు తనిఖీ చేసినట్లు డీఈఈ రామచంద్రా రెడ్డి, ఏఈ హరినాథ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లిలోని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ విషయాలలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచనలు ఇచ్చారన్నారు.

పెనగలూరు మట్టి, నీరు ఢిల్లీకి

పెనగలూరు : మండలంలోని మట్టి, నీటిని దేశరాజధానికి పంపిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్ర వలంటీర్, వివేకానంద యూత్ అధ్యక్షుడు కోడూరు మల్లికార్జున తెలిపారు. శనివారం ఎంపీడీఓ వరప్రసాద్ మట్టి, నీటిని మల్లికార్జునకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పద్మభూషన్ రెడ్డి, ఏపీఓ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ అనుభవం లేని అజ్ఞాని లోకేష్

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రాష్ట్రంలో టీడీపీ నాయకుల చెత్త మాటలు వింటుంటే వారి మానసిక పరిస్థితి బాగా లేదని అర్థం అవుతోంది.. రాజకీయంగా అనుభవం లేని అజ్ఞాని లోకేష్.. అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. చంద్రబాబు తనయుడు నారా లోకేష్ యువగళం పేరుతో యాత్ర చేసుకుపోతూ ఉంటే ఊళ్లలో జనం ఎవరి పనులు వారు చేసుకుంటూ పోతున్నారు తప్ప లోకేష్ యాత్రను వీక్షించడం లేదన్నారు. చివరకు టీడీపీ అధిష్ఠానం ఆదేశాలతో లోకేష్ యాత్ర ఎక్కడికెళ్లినా రెచ్చగొట్టే తిట్ల పురాణాలు, దాడులతో పేట్రేగిపోతున్నారన్నారు. ఇలాంటి హింసా రాజకీయాల ద్వారా ప్రజల మనసులు గెలుచుకోలేరనే విషయం తెలుసుకుని బుద్ధి తెచ్చుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి, జనసేనకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రాజకీయ పరిజ్ఞానం లేని లోకేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. 2014–2019లో ప్రజల పరిస్థితి ఎలా ఉండిందో, అదే 2019 తరువాత రాష్ట ప్రజల జీవన విధానం ఏ విధంగా మెరుగుపడిందో లెక్కలు పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రాని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి చాలా మెరుగైన స్థితిలో ఉందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 2014లో చంద్రబాబు అధికారం చేపట్టిన సమయంలో మూడున్నర లక్షల కోట్లు అప్పుచేశాడని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ కేవలం లక్షా 20వేల కోట్లు మాత్రమే అప్పు చేశారని తెలిపారు. చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే పొత్తు పెట్టుకోకుండా పోటీ చేయాలని సవాల్ విసిరారు. చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడుల వ్యాఖ్యలను కోర్టు సుమోటాగా తీసుకుని వారిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, బత్తల సుబ్రమణ్యం, క్రిష్టారెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మ విగ్రహ ప్రతిష్టలో ప్రభుత్వ విప్

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అరుంధతి వాడలో శనివారం జరిగిన మాతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ప్రతిష్ట కార్యక్రమంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట సాయి, పట్టణ అధ్యక్షుడు సీహెచ్.రమేష్, డీవీరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షునికి సన్మానం

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన పిల్లి రామకృష్ణను శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు శాలువా కప్పి సన్మానించారు.

తాళ్లపాకను అభివృద్ధి చేయాలి



టీటీడీచైర్మన్ భూమనను కలిసిన ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి అయిన తాళ్లపాకను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని ఏఐటీఎస్ అధినేత, ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చొప్పాగంగిరెడ్డి కోరారు. శనివారం ఆయన భూమనను సత్కరించి, టీటీడీ చైర్మన్ కావడం పట్ల అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య 600 జయంత్యుత్సవాలు తొలిసారి చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి హయాంలో ఘనంగా జరిగాయని గుర్తుచేశారు. అలాగే 108 అడుగుల అన్నమయ్య విగ్రం, అన్నమయ్య థీంపార్కు ఏర్పాటు జరిగిందన్నారు. రెండోసారి భూమన టీటీడీ చైర్మన్ కావడం వల్ల తాళ్లపాక మరింతగా పూర్వవైభవం సంతరించుకుంటుందని, ఈ మేరకు పలు వినతులు..సూచనలు ఇచ్చామన్నారు. గంగిరెడ్డి వెంట ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డిలున్నారు.

గ్రామసేవకుల అరెస్టు దుర్మార్గం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న గ్రామసేవకులు

రాయచోటి అర్బన్ : గ్రామసేవకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. శనివారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామసేవకులు నల్లరిబ్బన్‌లను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సేవకులకు అందిస్తున్న రూ.300 డీఏని రూ.600కు పెంచాలన్నారు. వీఆర్‌ఏ వ్యవస్థను రద్దుచేయాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామసేవకుల సంఘం జిల్లా కన్వీనర్ భోగేశ్వరయ్య, గ్రామసేవకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : తీవ్ర వర్షాభావ పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో గ్రామాలలో ఎక్కడైనా తాగునీటి సమస్య నెలకొంటే పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఆయన అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని బి.ఎర్రగుడి, మద్దిరేవుల, కురునూతల గ్రామాలలో తాగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందజేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. జేజేఎం ద్వారా నిధులు ఉన్న గ్రామాలలో బోర్లు వేయించి పైపుల ద్వారా తాగునీటిని అందించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ద్వారా గ్రామాలలో కూలీలకు పనులు కల్పించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు మామిడి మొక్కలు నాటుకోవడంతోపాటు ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు మునగ సాగు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఈసీ వెంకటాపతి తెలిపారు. భూమిలేని నిరుపేదలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు ఇచ్చేందుకు మొదట విడత పూర్తి చేశామన్నారు. రెండో విడత కూడా భూమిలేని నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తహసీల్దార్ ఉదయశంకర్ రాజు తెలిపారు. గ్రామాలలో డ్వాక్రా కొత్త గ్రూపులను ఏర్పాటు చేసి గ్రూపు సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను అందజేయాలని సభ్యులు ఏపీఎం నిరంజన్‌ను కోరారు. మల్చింగ్ ద్వారా సాగుచేసుకున్న పంటలకు నీటి ఎద్దడి నివారణతోపాటు నాణ్యమైన దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారి నాగమణి తెలిపారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో ఉలవలు అందుబాటులో ఉన్నాయని 20శాతం సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం అందజేస్తుందని వ్యవసాయ అధికారి రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు, మండల ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంఈఓ చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే

సంబేపల్లె : మండల పరిధిలోని ఎస్.సోమవరం గ్రామంలో నెలకొన్న సమస్యలపై శనివారం రాత్రి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరాతీశారు. ఈ సందర్భంగా గ్రామ మస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న మాజీ సర్పంచ్ పాలవెంకట్రమణనాయుడు, క్రిష్ణయ్యనాయుడులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరరెడ్డి, మాజీ జెడ్పీవైస్ ఛైర్మన్ దేవనాథరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే దుద్యాల గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన శివారెడ్డిని కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, ఆయా గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న సిద్దవటం మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంను సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకం, ప్రజా పంపిణీ- రెవెన్యూ కార్యక్రమాలు, విద్యుత్, పేదరిక నిర్మూలన- పొదుపు మహిళా సాధికారత, విద్య, వ్యవసాయం- ఉద్యాన శాఖ, మహిళా శిశు సంరక్షణ తదితర అంశాలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

వర్షాధార పంటలపై అవగాహన

రామాపురం : వర్షాధార పంటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో రైతు నరసింహరాజు వర్షాధార పంటగా సాగు చేసిన వేరుశనగ 60 రోజుల వయస్సుతో ఉండగా , వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోతోందన్నారు. ఈ పరిస్థితిలో 2శాతం యూరియా ద్రావణం పిచికారీ విధానాన్ని వివరించారు. రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సర్వేకు సహకరించాలి

గాలివీడు : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా పరిశీలన, సర్వేకు సహకరించాలని తహసీల్దార్ దైవాదీనం అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాకు సంబంధించిన బీఎల్‌ఓ, బీఎల్‌ఏ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, నమోదుకు అన్ని రాజకీయ పార్టీలు మండల యంత్రాగానికి సహకరిస్తూ పారదర్శక ఓటర్ల జాబితా తయారీలో భాగస్వామ్యం కావాలన్నారు. ఇంటింటా సర్వేతో పాటు అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయడం, డబుల్ ఓటర్లు, చనిపోయిన ఓటర్ల తొలగింపునకు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, రీ సర్వే డీటీ రెడ్డిబాబు, ఆర్‌ఐ బాలాజీ, బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థితో పాఠం చదివిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ జాకీర్ హుసేన్

రామాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాకీర్ హుసేన్ తెలిపారు. మండలంలోని నీలకంఠ్రావుపేట సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు రాత్రి సమయంలో స్టడీ అవర్స్ నిర్వహించాలని, రాబోవు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అనుపమ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సంతృప్తి



పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని డైట్ హాస్టల్ ప్రాంగణంలో మున్సిపల్ పార్కు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటుండటంపై ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఆయన మున్సిపల్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మహిళలకు రక్షణగా పోలీసులు గస్తీచర్యలు చేపట్టాలని సూచించారు. పార్కులో కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్వయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిదంబర రెడ్డి, కౌన్సిలర్ ఆసిఫ్‌అలీఖాన్, వైఎస్సార్‌సీపీ నేతలు పల్లా రమేష్, నవరంగ్ నిస్సార్, గంగిరెడ్డి, గడికోట చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ డీఈ సుధాకర్‌నాయక్, ఏఈ క్రిష్టారెడ్డి, ఆర్‌ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

రాయచోటి అర్బన్ : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న పలురకాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ, సాంబశివ, ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా నేతలు వేణుగోపాల్‌రెడ్డి, గాలిచంద్ర, సలీంబాషా డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాయచోటి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మబంధువు ముఖ్యమంత్రి



దండుగోపి

రాజంపేట : దళితుల ఆత్మబంధువు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ దండుగోపి అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి తండ్రి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్ కుటుంబానికి ఆది నుంచి దళితులు వెన్నుదన్నుగా ఉన్నారన్నారు. దళిత వర్గాలు ఎప్పటికి వైఎస్సార్ కుటుంబాన్ని ఆదరిస్తారన్నారు. దళితులు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావడానికి ముఖ్యమంత్రి అనేక సంక్షేమ కార్యక్రమాలను తీసుకొస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నూతన జిల్లా కమిటీలో కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాథమిక విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సమగ్ర శిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

మైదుకూరు : ప్రతి ఒక్కరూ చదువుకోవాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రాథమిక విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మైదుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, టాబ్స్, డిజిటల్ విద్యావిధానం, గోరుముద్దలో గుడ్లు, చిక్కీలు, రాగి జావ, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో మైదుకూరు మండల విద్యాశాఖాధికారి పద్మలత పాల్గొన్నారు.

రాయచోటి పశుసంవర్ధక శాఖ డీడీగా మాలకొండయ్య

రాయచోటిటౌన్ : రాయచోటి పశుసంవర్ధక శాఖ డీడీగా మాలకొండయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు రాయచోటి డివిజన్ పరిధిలోని పశుసంవర్ధకశాఖ ఏడీలు, డాక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు మరింత ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీలు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ కృష్ణయ్య (కలకడ), డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జగన్నాథరెడ్డి, డాక్టర్ నాగరాజ (మట్లి) డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

గాలివీడు : రెండవ శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని పలు దేవాలయాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. గాలివీడు కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో కొలువైన దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే ఆంజనేయ స్వామి దర్శనార్థం భక్తులు బారు తీరారు. అర్చకులు ఆనంద్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు , అర్చనలు, అభిషేకాలు జరిపారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాదాపు 400 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అరవీడు ఆంజనేయ స్వామి ఆలయంలో నాగఫణి కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బురుజుపల్లి-1, రామాలయంలో విగ్రహ ప్రతిష్ట హోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు , అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామగ్రి సమర్పించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులకు అభిషేకాలు చేసి ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు.

కేసుల పరిష్కారానికి అందరూ సహకరించండి

రాయచోటిటౌన్ : వచ్చే నెల 9వ తేదీ నిర్వహించే లోక్‌దాలత్‌లో అత్యధికంగా కేసుల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని రాయచోటి అదనపు డిస్ట్రిక్ జడ్జి కృష్ణన్ కుట్టీ పోలీసులకు సూచించారు. శనివారం రాయచోటి కోర్టు ఆవరణంలో రాయచోటి డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి షేక్ ఫాతిమా, అదనపు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ శారద పాల్గొన్నారు.

మదర్ థెరీసా సేవలు ఎనలేనివి

సిద్దవటం : సిద్దవటం మండలంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి సిద్దవటానికి చెందిన పూర్వ విద్యార్థులు మదర్ థెరీస్సా చిత్ర పటాన్ని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మధుశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు, రోగులకు మదర్ థెరిసా అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. శనివారం మదర్ థెరీస్సా జయంతి సందర్భంగా ఆసుపత్రికి ఆమె చిత్రపటాన్ని అందజేశామన్నారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి

లక్కిరెడ్డిపల్లి : జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహులు కోరారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలోని ఆపాస్ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే స్వేచ్ఛ ఉపాధ్యాయులకు ఇవ్వాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా ఇన్‌చార్జి కె.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.నరసింహులు, ఆపాస్ నాయకులు సుబ్బారెడ్డి, సాయిచరణ్ యాదవ్, రవిశంకర్, టేకూరి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు నాగులయ్య, కోశాధికారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జయశ్రీకి ఘన సన్మానం

రాజంపేట రూరల్: గ్రూప్-1 పరీక్షలలో ర్యాంకు సాధించి ఎంపీడీఓగా ఎంపికైన పోతుగుంట జయశ్రీకి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పరిధిలోని ఎగువ బసినాయుడుగారిపల్లిలో గల కోదండరామస్వామి ఆలయంలో శనివారం మాజీ సర్పంచ్ నాగోతు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జయశ్రీతో పాటు ఆమె తల్లిదండ్రులు పోతుగుంట నాగేశ్వరరావు, నాగలక్ష్మిలను సన్మానించారు. గ్రామ పెద్దలు జి.శివ, బి.వెంకటేశ్వరరావు, డాక్టర్ నవీన్, క్రిష్ణయాదవ్, బాలసుబ్రమణ్యం, జి.వెంకట్, ఎం.మణి, కె.సురేష్, తారక, ఎన్.రమణ, దేవ, డీసీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.